సులభంగా.. వేగంగా..

- జగనన్న సురక్షతో సత్వర సేవలు
- రోజుల వ్యవధిలో ధ్రువపత్రాలు
- దరఖాస్తుదారుల ఆనందం



64వ వార్డు గంగవరంలో మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



65వ వార్డు వికాస్‌నగర్‌లో దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదం చేస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేవలు సులభంగా, వేగంగా ఉచితంగా అందుతున్నాయన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం, 64వ వార్డు గంగవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న దృఢ సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. సాంకేతిక, ఇతరత్రా కారణాల వల్ల ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయని, మిగిలిన ఒక్క శాతం ఎవరైనా అర్హులు ఉంటే వలంటీర్లు ఇంటింటా జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తిస్తున్నారు. వారికి ఏయే పథకాలు అందాల్సి ఉంది? వాటి కోసం ఏమేం ధ్రువీకరణ పత్రాలు కావాలో వివరాలు నమోదు చేసుకుంటున్నారన్నారు. ప్రజలు తమకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్ల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటివద్దే ఉచితంగా ధ్రువ పత్రాలు అందుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. పేదలందరికీ లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ పని కావాలన్నా గత ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వమే అర్హులను గుర్తించి, సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు.

రెండు వార్డుల్లో 1922 ధ్రువపత్రాలు

ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు 64వ వార్డు పరిధిలోని గంగవరంలో 386, వెంకన్నపాలెంలో 486, 65వ వార్డు పరిధిలోని వికాస్ నగర్ ఇండోర్ స్టేడియంలో 1050 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, ఏపీడీ రాము, ప్రత్యేక అధికారులు శ్రీనివాసరావు, ప్రవీణ, సీవో వెంకటరత్నం, వార్డు నాయకులు పాల్గొన్నారు.

చాలా మంచి కార్యక్రమం



పిల్లల చదువుల కోసం కుల, ఆదాయ ధ్రువపత్రాలు అవసరమయ్యాయి. గతంలో డబ్బులు చెల్లించి, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకుని, 3 రోజుల్లో సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇది చాలా మంచి కార్యక్రమం. మాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– మాద మంగాదేవి, గంగవరం

పైసా ఖర్చు లేకుండా ధ్రువపత్రం



గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల చుట్టూ పనుల కోసం తిరిగే వాళ్లం. ఇప్పుడు సచివాలయానికి వెళ్తే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్లు ఇస్తున్నామని తెలిపారు. రెండు రోజుల క్రితం దరఖాస్తు చేశాను. పైసా ఖర్చు లేకుండా నాకు కుల ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ఎం.అమ్మాజీ, యాతపాలెం

నాలుగు రోజుల్లో సర్టిఫికెట్లు



నాలుగు రోజుల కిందట వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చారు. మీకు, మీ పిల్లలకు ఏమైనా సర్టిఫికెట్లు కావాలా అని అడిగారు. మా పిల్లలను స్కూల్‌లో చేర్పించడానికి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేశాను. జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందించారు. ధన్యవాదాలు.

– వడిసిల అప్పలకొండ, భానోజీతోట

క్లుప్తంగా

పకడ్బందీగా ఓటరు సర్వే

జేసీ విశ్వనాథన్



షీలానగర్‌లో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

అక్కిరెడ్డిపాలెం: ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 69వ వార్డు షీలానగర్‌లో శుక్రవారం నిర్వహించిన సర్వేలో జేసీ పాల్గొన్నారు. పలు నివాసాలకు వెళ్లి, ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు కార్డులను పరిశీలించిన అనంతరం ఓటర్ల జాబితాలో వారి వివరాలు ఉన్నాయో లేదో స్వయంగా పరిశీలించారు. సర్వేలో పాల్గొన్న సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఆర్వో లక్ష్మారెడ్డి, గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువతకు దుకాణాల కేటాయింపునకు వినతి

పెదగంట్యాడ: దళిత నిరుద్యోగ యువతకు పెదగంట్యాడ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు కేటాయించాలని కోరుతూ ములకలపల్లి ప్రకాష్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాంప్లెక్స్‌లోని దుకాణాలను కొంతమంది బడాబాబులు బినామీల పేర్లతో ఇతర కులాల వారికి అద్దెలకు ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో కాకినాడ అనిల్‌కుమార్, యల్లబెల్లి వెంకటరావు, గంట్యాడ పోలయ్య ఉన్నారు.

'గాంధీ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలి'



ఎమ్మెల్యే నాగిరెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న జాగారపు శ్రీను తదితరులు

పెదగంట్యాడ: గాజువాక జంక్షన్ నుంచి 60 అడుగుల రోడ్డులో కొత్తగా నిర్మించనున్న డివైడర్ మధ్యలో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం నాయకుడు జాగారపు శ్రీను కోరారు. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విగ్రహం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, తోకాడ అప్పారావు, గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దొండపర్తి(విశాఖ దక్షిణ): సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించిన రోజునే మహిళా సాధికారత సాధ్యమని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేరీ సుజాత కంటిపూడి పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా 'మహిళా సాధికారత, శిశు సంరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించకుండా మహిళా సాధికారత సాధ్యపడదని చెప్పారు. ముఖ్యంగా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక శ్రేయస్సుకు మహిళల్లో శారీరక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రఫుల్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వెల్లడి
- 890వ రోజుకు రిలే దీక్షలు
- నేడు 'సేవ్ వైజాగ్ స్టీల్' పాదయాత్ర

కూర్మన్నపాలెం : మహనీయుల త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నామని ఉక్కు, పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 890వ రోజు శుక్రవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 8 గంటలకు హిందుస్థాన్ జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెం వరకు సేవ్ వైజాగ్ స్టీల్ పేరుతో పాదయాత్ర నిర్వహిస్తామని తెలియజేశారు. కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు యామలపల్లి లక్ష్మణరావు

కూర్మన్నపాలెం: విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం తాజంగి గ్రామానికి చెందిన యామలపల్లి లక్ష్మణరావు (28) కూర్మన్నపాలెంలో నిర్మితమవుతున్న ఎంవీవీ అండ్ ఎంకే పార్కు అపార్ట్‌మెంట్స్‌లో పది నెలలుగా ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అల్లిపురంలోని బంగారుమెట్టలో సోదరుడు యామలపల్లి రామకృష్ణ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విధులకు హాజరైన లక్ష్మణరావు ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై, ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్నయ్య యామలపల్లి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: రాష్ట్ర ప్రజలందరి శ్రేయస్సు కోరి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు ఏడుమెట్ల మత్రిపాలెం, గొన్నువానిపాలెం ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రేయో రాజ్య నిర్మాణం కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ఆయనకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, గొన్నా విద్యాసంస్థల కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొన్న హేమచంద్ర నాయుడు, నాయకులు అమరపిని రమేష్, జి.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాసరావు, జి.వి.రమణ, జి.హరీష్, నక్కా హరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం,మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విశేషంగా తిరువీధి

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం సింహవల్లీ తాయారు అమ్మవారికి తిరువీధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో అధిష్ఠంపజేసి ఆలయ బేడామండపంలో సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.విశేషంగా హారతులు అందజేశారు.

ఆదివాసీలపై దాడులు దారుణం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లయ్య

ఉక్కునగరం: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హత్యలు, దమనకాండ, అత్యాచారాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం ఉక్కు ఎల్‌డీసీ విభాగం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ మణిపూర్‌లో అమాయకులైన ఆదివాసీలపై దాడులు చేస్తున్నారన్నారు. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. దాడులకు రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎస్. సత్యనారాయణ, ఎల్.వి. రమణారావు, మోహన్‌బాబు, డి. అప్పారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు వై.టి. దాస్, వై. మస్తానప్ప, కర్రా ప్రకాశ్, టి. చిరంజీవి, కె. పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం

మహారాణిపేట: ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పారిశుధ్య శాఖ విడుదల చేసిన సమాచారం ద్వారా రాష్ట్రంలో ఫ్లోరోసిస్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించేందుకు తీర్చిదిద్దిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సమత, ఇతర వైద్యులు, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటైంది. చైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కార్యదర్శిగా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ శివప్రసాద్, సభ్యులుగా విద్యాశాఖ ఏడీ జ్యోతి, ప్రాజెక్టు అధికారి సమత తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలువ్యాపారాలు నిర్వహించుకోవడానికి శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి కొన్ని, ముడేళ్ల కాలపరిమితితో కొన్ని లీజు హక్కులు కల్పించారు. హెచ్చు మొత్తంలో పాడిన వారికి అధికారులు షాపులు ఖరారు చేశారు. సింహగిరిపై భక్తులకు ఫొటోలు తీసేందుకు ఏడాదికి రూ. 26.33 లక్షలు, కాఫీ,టీల విక్రయానికి రూ.42వేలకు ఖరారు చేశారు. సింహాచలం గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.96వేలు, గోపాలపట్నం బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు లక్షా 43వేలు, కేశ ఖండనశాల వద్ద షాపు అద్దె నెలకు రూ.38వేలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని 68వ దుకాణానికి నెలకు రూ. 37వేలు, కొండదిగువ పురూరవ బిల్డింగ్‌లోని 29, 32 దుకాణాలకు నెలకు రూ.12,500 చొప్పున, పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడో నెంబర్ షాపునకు నెలకు రూ.10,400, ప్రహ్లాదపురంలోని షాపు నెంబర్ 8 నెలకు రూ.3 వేల అద్దెకు ఖరారు చేశారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఈవోలు రమేష్, జంగం శ్రీనివాస్, సూపరింటిండెంట్ అప్పారావు, ఉద్యోగులు దొంతల రమణ తదితరులు వేలం పాటలు నిర్వహించారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

అగనంపూడి: సేవాస్ఫూర్తితో ప్రతీ లబ్ధిదారు మన్ననలు అందుకుంటున్నారు వలంటీర్లు. ఏ పథకం ఎప్పుడు అందుతుందో తెలియజేస్తూ అవసరమైన పత్రాలను అందిస్తూ ఎంతో సహకరిస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడుతున్నారు.

ఆస్పత్రికి వచ్చి పింఛన్



నాకు ఆరోగ్యం బాగా లేక నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, కదల్లేని స్థితిలో ఉన్న నాకు వలంటీర్ నానాజీ ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించారు. ఎంత దూరంలో ఉన్నా వెదుక్కుంటూ వచ్చి పింఛన్ ఇస్తే ఎంతో ఆనందం అనిపించింది. ఇప్పుడు కూడా ప్రతీ నెలా ఒకటో తేదీన ఠంచనుగా వచ్చి పింఛన్ ఇస్తున్నారు.

– మల్లేశ్వరి చినతల్లి, మంగళపాలెం

దివ్యాంగుడికి పింఛన్



కోవిడ్ సమయంలో ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి. ఆ సమయంలో కూడా వలంటీర్ బి.సత్యవేణి మా ఇంటికి వచ్చి దివ్యాంగుడైన మా బాబుకు పింఛన్ అందించారు. ఇప్పటికీ తనను తీసుకుని ఎక్కడికైనా వెళ్లాలంటే కష్టం. పింఛన్ ఇంటికే తెచ్చి అందించడం వల్ల ఇబ్బంది తప్పింది. ఎంతో రుణపడి ఉన్నాం.

– జాజుల వెంకటలక్ష్మి, అట్టవానిపాలెం

ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు



కుల ధ్రువీకరణ పత్రం లేక సంక్షేమ పథకాలకు అర్హత ఉండటం లేదు. వలంటీర్ జి.సత్యవతి వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేయించారు. మూడు రోజుల్లోనే ధ్రువపత్రం వచ్చింది. సంక్షేమ పథకాలకు అర్హత వచ్చింది.

– దేవి, పెదమడక

అమ్మ ఒడి కోసం ఇంటికొచ్చి బయోమెట్రిక్



మా పాప పాఠశాలలో చదవడంతో నాకు జగనన్న అమ్మ ఒడి పథకానికి అర్హత వచ్చింది. బ్యాంకులో డబ్బు వేయాలంటే బయోమెట్రిక్ అవసరమని చెప్పారు. వలంటీర్ రాజేశ్వరి మా ఇంటికి వచ్చి బయో మెట్రిక్ వేయించారు. నాకు అమ్మ ఒడి డబ్బులు అందాయి. వలంటీర్ల సహకారంతో ప్రతీ పథకం మాకు అందుతోంది. వారి సేవలు అభినందనీయం.

– జన్నెల ధనలక్ష్మి, కొండయ్యవలస

సమష్టి సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫస్ట్ ర్యాంక్



మొక్కలు నాటుతున్న సీఎంవో నరేష్‌కుమార్

కూర్మన్నపాలెం: నగర ప్రజల సమష్టి సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానం సాధ్యపడుతుందని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులో శుక్రవారం పర్యటించిన ఆయన ముందుగా తిరుమలనగర్ పార్కులో మొక్కలు నాటారు. అనంతరం కంపోస్టపిట్, ఇంకుడు గుంతలు, ట్రాన్స్‌ఫార్మర్‌పై వేసిన ఎకో వైజాగ్ ఆర్ట్స్, టెర్రస్ గార్డెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలనగర్ కాలనీవాసులు, అసోసియేషన్ చేస్తున్న కార్యక్రమాలు స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలకు ఉపయోగపడే విధంగా ఉండడంతో పాటు ఇతరులకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. తిరుమలనగర్ కాలనీవాసులను ఆదర్శంగా తీసుకుని నగరంలోని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని, భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, శానిటరీ కార్యదర్శులు సంధ్య, అనిల్‌కుమార్, మేస్త్రీ మూర్తి, అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్, సత్యనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అగనంపూడి: సీజనల్ వ్యాధుల బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం సూచించారు. 79వ వార్డు లంకెలపాలెంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని, పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేర్వేరుగా నిల్వ చేసి, జీవీఎంసీ సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సుందరపు అప్పారావు, యలమర్తి వెంకటరావు, కాతా నూకేశ్వరరావు, జీవీఎంసీ గాజువాక జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మార్చ్'ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌సాయిరాం

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించనున్న కాంగ్రెస్ మార్చ్ పాదయాత్రను జయప్రదం చేయాలని డీవీఆర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గళ్లా శంకర్‌సాయిరాం కోరారు. 74వ వార్డు వెంపళ్లనగర్‌లో యూనియన్ నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8 గంటలకు జింక్ గేట్ నుంచి పాదయాత్ర ప్రారంభం కానుందని, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు హాజరు కానున్నారని తెలిపారు. డీవీఆర్ ఎంప్లాయిస్ యూనియన్, డీవీఆర్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీవీఆర్, దల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలవెన్సులపై కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన బాట



కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ప్రత్యేక అలవెన్సుల కోసం ఆందోళనకు సిద్ధమవుతున్నారు. కాంట్రాక్టర్లు కార్మికులకు ఈ నెల జీతాలతో ఇవ్వాల్సిన ప్రత్యేక అలవెన్సులు ఇవ్వకపోవడాన్ని కాంట్రాక్టు కార్మిక సంఘాలు నిరసిస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఎల్‌ఎంఎం పార్కులో జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 5 వరకు రోజుకు మూడు విభాగాల చొప్పున ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు దిగ్బంధం చేయాలన్నారు. ఆగస్టు 11వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు కోక్ ఓవెన్స్ నుంచి అడ్మిన్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేయనున్నామని తెలిపారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే సమ్మె నోటీసు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో మంత్రి రవి, సోమరాజు, జి. శ్రీనివాసరావు, పి.వి. నగేష్, జి. సత్యారావు, ఉమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.